# ప్రకృతి స్పర్శ

నీలాకాశంలో పరిగెడుతున్న తెల్లమబ్బులు తాడుమీంచి గాలికెగురుతున్న ధవళ వస్త్రాల్లా వున్నాయి. పచ్చని తామరాకుల మీదున్న మల్లెలు తళుక్కున మెరిసే నక్షత్రాల్లా ఉన్నాయి.

మల్లెల రాసుల ముందు స్టూలు మీద కూర్చుని, సూదితో మల్లెదండలు కడుతున్న ముసలమ్మ చందమామలో రాట్నం వడుకుతున్న ముసలమ్మలాగే ఉంది.

రామదాసును చూడగానే ఆమె ముఖం విప్పారింది.

"ఇదిగో, దాసూ" అంటూ తామరాకులో పొట్లం కట్టి వుంచిన మల్లెదండ ఇచ్చింది. రామదాసు అది తీసుకుని డబ్బులిచ్చాడు.

"ఇయాలా బాగా ఆలీసంగా వచ్చావేటి దాసూ" అంది ముసలమ్మ.

"ఆఫీసులో పనుండి లేటయింది. వస్తా మామ్మా" అని ముందుకు కదిలాడు.

రామదాసు ఇంటికెళ్లేసరికి కృష్ణవేణి శుభ్రంగా తయారై అతని కోసం ఎదురుచూస్తోంది.

"గంట నుంచి మీరొస్తారని చూస్తున్నాను. ఇంత లేటయిందేం."

"ఆఫీసుకు లేటయితే నువ్వు కారణం. ఇంటికి లేటయితే ఆఫీసరు కారణం. నా చేతుల్లో ఏముంది కృష్ణా, నిమిత్త మాత్రుణ్ణి" అన్నాడు రామదాసు వైరాగ్యం అభినయిస్తూ.

"మళ్ళీ నా మీదకే తెచ్చారూ, నా వల్ల మీరెప్పుడు ఆఫీసుకు లేటయ్యారో చెప్పండి ముందు".

"సరదా కన్నానులే - సత్యభామవై పోకు" అని ఆమె గడ్డం నిమిరి లోపలి గదిలో కెళ్లాడు.

రామదాసు స్నానం చేసి, లుంగీ కట్టుకుని వచ్చేటప్పటికి టీ కప్పు చేతికిచ్చింది కృష్ణవేణి.

టీ తాగి, పొట్లం విప్పి, మల్లెదండను కుడి చేతి బొటన వేలుతోనూ, చూపుడు వేలుతోనూ పట్టుకుని నిలబడ్డాడు రామదాసు.

ఒక్క నిమిషం అతని వంకా, అతని చేతి నుంచి వేలాడుతున్న మల్లెదండ వంకా చూసి, దండనందుకుని తలలో తురుముకుని, అతని తల నిమిరింది కృష్ణవేణి. తొమ్మిదేళ్ల రామదాసును వూహించుకుంది ఎప్పట్లానే....

పెళ్లయిన కొత్తలో రామదాసు మల్లెదండ తెచ్చి, కుడి చెయ్యి నిదానంగా చాపి, బొటనవేలితోనూ, చూపుడు వేలుతోనూ దాన్ని పట్టుకున్నప్పుడు - వేలాడుతున్న మల్లెదండను చూసి కృష్ణవేణి తెగ సంబరపడిపోయింది. అయితే, రోజూ అతను అలాగే నిలబడి, మల్లెదండ వేలాడేలా పట్టుకుని వుండడం వింతగా అనిపించి, ఒకనాడు అడిగేసింది.

"కృష్ణా, మల్లెదండనలా పట్టుకోవడం నాకిష్టం. నా అలవాటు కూడా. మాది ధవళేశ్వరం దగ్గర చిన్న పల్లెటూరు. మా నాన్న నా చిన్నప్పుడే పోయాడు. మా అమ్మ రోజూ మల్లెపూల దండలు కట్టి నాకిచ్చేది. ప్రతి సాయంత్రం నేను స్కూలు నుంచి రాగానే వాటిని పట్టుకుని ధవళేశ్వరం - రావులపాలెం రోడ్డు పక్కన నిలబడే వాణ్ణి. కార్ల మీదా, స్కూటర్ల మీదా వచ్చే దంపతులకు కనిపించేలా మల్లెదండను చూపి, ఆగిన వాళ్లకు దాన్ని అమ్మేవాణ్ణి. నాకప్పుడు తొమ్మిదేళ్లనుకుంటా. ఎనిమిదో తరగతి చదివే వరకూ కూడా ఆ రోడ్డు మీద మల్లెపూలదండలమ్మాను. కొన్నాళ్లు మా చెల్లెలూ అమ్మింది. మా దొడ్లో మల్లెపూలు పూసేవి. ఇల్లంతా సువాసనతో నిండిపోయేది" అని చెప్పి "కృష్ణా, ఎప్పటికన్నా మనం ఓ చిన్న ఇల్లు కట్టుకుని, పెరట్లో మల్లె తీగ వేసుకోవాలి" అన్నాడు రామదాసు.

అతని చిన్నప్పటి ఫోటోలేమీ లేకపోవడంతో అతను మల్లెపూల దండ పట్టుకున్న ప్రతిసారీ, కృష్ణవేణి తొమ్మిదేళ్ల దాసును వూహించుకుంటుంది. తల నిమురుతుంది. తొమ్మిదేళ్ల పిల్లాడి తల నిమిరినట్టే ఆ క్షణంలో ఆమెకనిపిస్తుంది.

రాత్రి ఎనిమిదయ్యింది. ఇద్దరూ భోంచేశారు.

ఆకాశంలో చంద్రుడు చక్కర్లు కొడుతున్నాడు. ఏ చుక్కను ఎంచుకోవాలో తెలీక ఒకో చుక్కనూ దాటుకుంటూ ముందుకెళ్ళి పోతున్నాడు. చంద్రుడు తనను దాటి వెళ్లగానే ప్రతి చుక్కా ఒక్కసారి ఆరి, 'రేపెక్కడికి పోతాడులే' అనుకుని మళ్లీ వెలుగుతోంది.

రామదాసు మంచమెక్కి, కృష్ణవేణిని సుతారంగా తన మీదకు లాగాడు. కృష్ణవేణి ముద్దుగా అతని పెదాలు ముద్దాడింది. రామదాసులో ఉత్సాహం ఉరకలువేసింది. తనకిష్టమైన మల్లెల పరిమళం, తన కిష్టమైన కృష్ణవేణి - శరీరమూ, మనసూ, చేష్టా ... ప్రకృతి పచ్చపచ్చగా పరవశించింది. మల్లెలు మెల్లిమెల్లిగా పరిమళించాయి. కృష్ణవేణి వెచ్చవెచ్చగా అల్లుకుపోయింది. రామదాసు వేడివేడిగా సెలయేరై కదలిపోయాడు.

☆ ☆ ☆

రాత్రి తొమ్మిదిన్నర. ఆకాశంలో మినుకు మినుకుమంటున్న నక్షత్రాలు విద్యుద్దీపాల తోరణాల్లా వున్నాయి.

వి.ఆర్. పంతి ఆఫీసర్స్ క్లబ్ నుంచి రయ్‌మని వచ్చి, ఇంటి ముందు కారాపి, హార్న్ వాయించాడు. ఇందుమతి గబగబా ఇంట్లోంచి వచ్చి, గేటు తీసింది. కారు లోపలికొచ్చాక గేటు వేసి డైనింగ్ హాల్లో కెళ్లింది. వి.ఆర్. పంతి బట్టలు మార్చుకుని, ముఖం కడుక్కుని, డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు. మౌనంగా భోం చేసి, పడగ్గదిలోకెళ్లాడు. రేర్ పెర్‌ఫ్యూమ్ బాటిల్‌ను అలమరా లోంచి తీసి ప్లాస్టిక్ బకెట్‌లోని నీళ్లల్లో కొన్ని చుక్కలు వేసి, ఆ నీళ్లు ఎయిర్ కూలర్‌లో పోశాడు. గదంతా ఓ వింత సువాసన. అతనికి ఆ సువాసన ఇష్టం. మంచం మీద నడుం వాల్చి కళ్లు మూసుకున్నాడు.

"ఏంటీ ఆలోచిస్తున్నారు?"

"ఏం లేదు" అన్నాడు వెంటనే.

నిజానికతను ఆఫీసు విషయాలేవో ఆలోచిస్తున్నాడు. ఇందుమతి లైటార్పి, అతని పక్కన పడుకుంది. గదిలో నిండిన ఆ సువాసన ఆమెకిష్టం లేదు. అయినా, ఆ సువాసనకు అలవాటు పడడానికి ప్రయత్నిస్తోంది.

పెళ్లయిన కొత్తలో అడిగింది నెమ్మదిగా,

"ఈ పెర్‌ఫ్యూమ్ పరిమళమంటే మీ కంత ఇష్టమా" అని.

"నా కది చాలా ఇష్టం. ఈ రేర్ పెర్‌ఫ్యూమ్ నిజంగా రేరే. నేను విశాఖపట్నంలో ఎం.కాం. చదివేటప్పుడు దాన్ని ఓ ఫ్రెండ్ దగ్గర చూశాను. స్మగుల్డ్‌దని తెలుసుకుని మర్నాడు దాన్ని కొన్నాను. యూనివర్శిటీలో దాన్ని వాడే వాళ్లను ప్రత్యేకంగా చూసేవారు. ఖరీదెక్కువైనా భలే బావుంటుంది" అని చెప్పాడు వి.ఆర్.పంతి.

"నాకేం బావోదు" అందామనుకుని, అతన్ని నొప్పించడమెందుకని వూరుకుంది.

వి.ఆర్.పంటి ఇందుమతి వైపు జరిగి, ఆమె నడుంపై చెయ్యి వేశాడు. ఆమె యాంత్రికంగా జాకెట్టు బొత్తాలు విప్పింది. అతనూ యాంత్రికంగా ఆమె పైకెగబాకాడు...మరలు తిరుగుతున్న ధ్వనులు. మూసుకుంటున్న కనులు.

☆ ☆ ☆

ఆ రోజు ఆ పట్నమంతా బంద్. ఎవరో ప్రముఖ నాయకుడు పోయారట. ఆ పార్టీవాళ్లు అప్పటికప్పుడు బంద్‌కి పిలుపిచ్చారు.

రామదాసు ఆఫీసు నుంచి వస్తూ మల్లెల మామ్మ కోసం చూశాడు. అందరూ కొట్లు కట్టేసినప్పుడు, ఆమె మాత్రం ఎందుకుంటుందని అనుకుని ఇంటి ముఖం పట్టాడు.

కృష్ణవేణి ఇచ్చిన టీ తాగాడు. అతని చేతిలో మల్లెపూల పొట్లం లేకపోవడం ఆమె గమనించింది. ఆ మూడు రోజులప్పుడు కూడా పూలు తేవద్దని తను చెప్పినా అతను వినలేదు. అలాంటిదీవేళ ఎందుకు తేలేదబ్బా అనుకుంది. ఆమె మనసు గ్రహించినట్టు-

"ఇవేళ మల్లెలు బంద్. ఎందుకంటే పట్నం బంద్" అన్నాడు రామదాసు.

"ఒకనాడు లేకపోతే ఫర్వాలేదులెండి"

"అంటే, రెండ్రోజులు లేకపోతే ఫర్వావుందన్నమాట"

'అదిగో..." అనబోయి అతని కొంటెతనం గమనించి "సర్లెండి" అని నవ్వేసింది కృష్ణవేణి.

కొంతసేపు ఆ కబురూ ఈ కబురూ చెప్పుకున్నారు.

"మళ్లీ చెప్పడం మరిచేను. రేపొద్దుటే లేపు. మా ఆఫీసరింటి కెళ్లాలి" అన్నాడు రామదాసు.

"ఆయన పేరేంటి? మర్చిపోయాను"

"వి.ఆర్.పంటి"

"అదేం పేరు?"

"అదో స్టయిల్లే. పంటి వెంకటేశ్వరరావు పేరును అలా కుదించుకున్నాడు" అని చెప్పాడు రామదాసు.

వెన్నెలొచ్చేసింది. అంతవరకూ ఎండ వేడికి వేసారిన నేల తల్లి వెన్నెల వెన్నను ఒంటికి అద్దుకుంది. చంద్రుడు తన లోకం చాలదన్నట్లు ఈ లోకానికి కన్ను

గీటేశాడు.

"వడ్డించనా"

"ఏవిటీ" అన్నాడు రామదాసు ఆమె గుండెల్ని చూస్తూ.

"అదిగో మరి" అనేసి నవ్వాపుకుని "రండి" అంది.

"ఇవాళ డాబా మీద పడుకుందాం"

"అలాగే, ముందు భోజనానికి రండి"

"అట్లే కానీ" అని లేచాడు.

భోజనం చేశారు. ఓ చాపా, రెండు దిళ్ళూ పట్టుకుని డాబా మీద కెళ్ళారు.

"వెన్నెలింత హాయిగా ఎందుకు కాస్తోందంటావు"

"నేనీ తెల్ల చీర ఎందుకు కట్టుకున్నానంటారు"

"చంద్రుడీ వేళ ఏ చుక్కకు చిక్కి లిగింత పెడతాడంటావు"

"మీరు నా పక్కనెందుకు పడుకున్నారంటారు"

"అమ్మో, మాటలు బాగా నేర్చావే"

"ఆరేళ్ళ సావాసం మరి."

"ఇంక నీతో మాట్లాడను"

"ఆ సంగతి నాకు తెలుసులెండి. అయితే, మల్లెలు లేవు కనక, పాపం మీకివేళ పస్తే'

"మనసున మల్లెల మాలలూగెనే"

"పరిమళాలు లేకపోయేనే"

"పిచ్చి కృష్ణా, నీ ఒంటి సువాసన వుందిగా"

"నా ఒంటికి సువాసనా"

"అవునే ఆలివేణీ, మల్లెల సువాసనే కాదు, నీ ఒంటి పరిమళమూ నాకిష్టమే"

ఆ మాటకు ఆమె పరవశించి పోయింది. వీపుపై అతని చేతి స్పర్శకు వికసించి పోయింది. పులకిత జలధి తరంగమై పోయింది. రామదాసు రసరమ్య గీతమై ప్రణయ రాగ సుధాంబుధిలో ఓలలాడి పోయాడు.

☆ ☆ ☆

చంద్రుడు చుక్కలతో తిరిగి తిరిగి చిక్కి పోయాడు. ఆకాశం అనీలమై చంద్రుడికి సానుభూతి తెలిపింది. చుక్కలు సంతృప్తితో మురిసిపోతూ మెరిసి పోతున్నాయి.

వి.ఆర్. పంతి చిరాగ్గా ఆఫీసర్స్ క్లబ్ నుంచి ఇంటికొచ్చాడు. స్నానం చేసి, భోజనం ముగించి పడగ్గదిలో కెళ్ళాడు. కూలర్‌లో నీళ్ళయి పోయి నట్టున్నాయి. అదో రకం వాసన వస్తోంది. వి.ఆర్. పంతి రేర్ పెర్ఫ్యూమ్ బాటిల్ తీసుకుని బకెట్‌లోని నీళ్ళల్లో కొన్ని చుక్కలు వెయ్యిబోయాడు. పెర్ఫ్యూమ్ నిండుకుంది. వి.ఆర్.పంతికి పంతి కింద రాయి పడ్డట్టయింది. అదే ఆఖరి బాటిల్. ఎంత ప్రయత్నించినా రేర్ పెర్ఫ్యూమ్ రేర్ అయిపోయింది. ఒట్టి నీళ్ళే కూలర్‌లో పోసి, నీరసంగా మంచంమీద వాలాడు. కొద్ది సేపటికి కూలర్ నుంచి అదోరకం వాసన ఆగిపోయింది. పడగ్గది వి.ఆర్. పంతికి ఖాళీ పెర్ఫ్యూమ్ బాటిల్‌లా అనిపించింది.

ఇందుమతి వంట గదిలో సామాన్లు సర్ది పడగ్గదిలో కొచ్చింది. గదిలో రోజూలా తనకు నచ్చని వాసన లేదు. మనసుకు కాస్త హాయిగా వుంది.

"ఏవిటలా వున్నారు"

"పెర్ఫ్యూమ్ అయిపోయింది. ఎంత ప్రయత్నించినా దొరకలేదు. అదిక దొరకదట. అందులో ఆరోగ్యాన్ని పాడు చేసేవేవో వున్నాయని దాన్ని నిషేధించారట" అన్నాడు వి.ఆర్. పంతి దిగులుగా.

ఆరోగ్యాన్ని పాడుచేసేవనే మాట వినడంతో ఇందుమతికి ధైర్యం వచ్చింది.

"పోన్లెండి. అదీ మన మంచికే. నిజానికి ఆ వాసన నాకసలు ఇష్టం లేదు."

"నీ కిష్టం లేదా"

"లేదు"

"మరింత కాలం"

"మీ కిష్టం కదా. అందుకని మీరు చిన్న బుచ్చుకుంటారని భరించాను."

వి.ఆర్. పంతికి ఓ పక్క అనందం, మరో పక్క బాధ. అతను ఆలోచనలో పడ్డాడు.

" నా ఇష్టం కోసం ఇందుమతి తన అయిష్టాన్ని వెలిబుచ్చకుండా వుండిపోయింది. ఆమెకా వాసన ఇష్టమో కాదో నేనెందుకు తెలుసుకోలేదు; అవును. గుర్తొస్తోంది. ఒకసారి తను అడగాలనుకునీ అడగలేదు. పొద్దుట రామదాసు ఫైలు పట్టుకుని వచ్చినప్పుడు, అతను తయారు చేసిన ఎస్టిమేషన్స్ చాలా బావున్నాయనిపించి, ఆ మాట అతనితో అందామని అనలేదు. ఇందాక ఆఫీసర్స్ క్లబ్‌లో పేకాట ఆడుతుండగా ఒక ఆఫీసరు ఓకులు తప్పుగా లెక్కపెట్టడం, మరోసారి కౌంటు అయినా ఎనిమిది

ఒకులే అని అబద్ధమాడడం చూసి తను చూడనట్టే వూరుకున్నాడు. అంటే తను మామూలుగా ప్రవర్తించ లేకపోతున్నాడు. ఇంటా బయటా తను మామూలుగా వుండడం లేదు. తనిక మామూలుగా వుండాలి. క్లబ్ కెళ్ళడం మానెయ్యాలి. ఇందుమతి ఇన్నాళ్ళూ నాకోసం భరించానంది. ఆ మాటను నేను భరించలేక పోతున్నాను....."

అతను ఆలోచనల్లో పడ్డాడని గ్రహించి,

"ఎందుకంతలా ఆలోచిస్తారు. ఆ కృత్రిమమైన పెర్ఫ్యూమ్ లేకపోతేనేం? సహజమైన చల్లటి సువాసన నిచ్చే మల్లెలున్నాయి. అవి ఎప్పుడూ వుంటాయి. అదే పెర్ఫ్యూమ్ వుందనుకోండి. ఏదో ఫ్యాక్టరీ తయారు చేస్తుంది. ఆ ఫ్యాక్టరీ ఏ కారణంగానన్నా ఆగిపోతే అది దొరకదు. ప్రతి దానికీ యంత్రాల మీద ఆధారపడ్డం కంటే ప్రకృతి మీద ఆధారపడ్డం మంచిదనుకుంటాను. రేపటి నుంచి మల్లెపూలు తీసుకురండి. మీ కిష్టం లేకపోతే వద్దులెండి" అంది ఇందుమతి.

"సారీ, అలాగనకు, తప్పకుండా తెస్తాను" అన్నాడు పంటి వెంకటేశ్వరరావు.

"మా వారు మా మంచివారు. రేపే పెరట్లో ఓ మల్లె అంటు వేస్తాను. ఓ రెండు కొబ్బరి మొక్కలు కూడా తెప్పించండి" అంది ఇందుమతి ఉల్లాసంగా.

లైటార్పి ఇందుమతి అతని వీపుపై చెయ్యివేసింది. అతని నుదుటిపై ముద్దిడింది. మరింత దగ్గరగా జరిగింది. ఆ స్పర్శలో తేడా అతనికి తెలుస్తోంది.

(ఆంధ్రజ్యోతి వార పత్రిక, (4-10-91)